## క్లుప్తంగా

### ఎమ్మెల్యేను కలిసిన ఆలయ చైర్మన్

**చాపాడు :** మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన పెరుగు వీరనారాయణ యాదవ్ బుధవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎమ్మెల్యే ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారన్నారు. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో అల్లాడుపల్లె దేవళాలు వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, టీడీపీ యువ నాయకులు గుత్తి నారాయణ యాదవ్, కొండప్లి శేషగిరి, సుధాకర్‌రెడ్డి, జయరాం, సురేష్ పాల్గొన్నారు.

### మాతాశిశు సంరక్షణకు కృషి చేయాలి

**బద్వేలు అర్బన్ :** మాతాశిశు సంరక్షణకు వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.రవిబాబు పేర్కొన్నారు. బుధవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణీస్త్రీని, బాలింతలను, చిన్న పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సకాలంలో వ్యాధినిరోధక టీకాలు అందించడంతో పాటు ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలని కోరారు. గ్రామాల్లో సర్వేలు నిర్వహించి కీటక జనిత వ్యాధులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పైఅధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.రాజేష్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి**
పట్టణంలోని ప్రతి ప్రైవేటు ఆసుపత్రి, స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.

### దాతల సహకారంతో స్టేజీ నిర్మాణం

**రాజుపాళెం :** దాతల సహకారంతో స్టేజీని నిర్మిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని వెలవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టేజీ నిర్మాణానికి రూ.2లక్షలు దాతల సహకారంతో బుధవారం హెచ్‌ఎం టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ పాఠశాలకు చైర్మన్ అయ్యాక దాతలతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్టేజీ నిర్మాణానికి ముదిరెడ్డి సాంబశివారెడ్డి సిమెంట్, ముక్తి యార్ రూ.10వేలు, రిటైర్డు టీచర్ నాగయ్య రూ.10వేలు, రాజు సార్ రూ.10వేలు, ఎస్.కృష్ణారెడ్డి రూ.10వేలు ఇంకా కొంత మంది దాతలు సహకరించారన్నారు.

### నివాళి



మదన్‌మోహన్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

**దువ్వూరు :** మండలంలోని సంగటితిమ్మాయపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలు మదన్‌మోహన్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి మదన్‌మోహన్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో చింతకుంట సర్పంచ్ కోగటం వీరారెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఏఎస్‌పల్లె సర్పంచ్ పుత్తా శ్రీనివాసులరెడ్డి, వీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### గ్రిల్ దెబ్బతిని వాహనదారులకు కష్టాలు



గాయత్రి నగర్ ఎంట్రన్స్ వద్ద దెబ్బతిన్న గ్రిల్

**ప్రొద్దుటూరు :** వైఎంఆర్ కాలనీలోని గాయత్రి నగర్ ఎంట్రన్స్ వద్ద మున్సిపాలిటీ వారు మురికి కాలువపై ఏర్పాటు చేసిన గ్రిల్ దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు పొరపాటున గుంతలో పడి ఇరుక్కుపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### కేబుల్ దొంగల పట్టివేత

**బి.కోడూరు :** మండలంలో గత కొంతకాలంగా వ్యవసాయ మోటారు, స్టార్టర్ల కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించి దోచుకెళ్తున్నారు. మండలంలోని నరసయ్యకొట్టాల గ్రామానికి చెందిన రైతులు సుబ్బారెడ్డి, చెంచిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, మరింత మంది దొంగలను పట్టుకునేందుకు కాపు కాచారు. కేబుల్ వైర్లను పట్టపగలే కత్తిరించేందుకు వచ్చిన యువకులను చాకచక్యంగా పట్టుకున్నారు. బద్వేల్ రూరల్ సీఐ క్రిష్ణయ్య, బి.కోడూరు ఎస్ఐ వెంకట సురేష్ చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి యువకులను అదుపులోకి తీసుకున్నారు.

# ఉత్సాహంగా జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో బుధవారం జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–14, 17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలలకు చెందిన వంద మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ క్రీడా నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో 46 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఎం ఇమాంహుస్సేన్, జార్జికారొనేషన్ క్లబ్ సెక్రటరీ మార్తల సుధాకర్‌రెడ్డి, ప్రెసిడెంట్ బాలగంగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఓబుళరెడ్డి, ఈసీ మెంబర్ రామసుబ్బారెడ్డి, రాజుపాళెం ఎంఈఓ ప్రసాద్, కోఆర్డినేటర్ రాఘవేంద్ర, వ్యాయామ సంచాలకులు శివారెడ్డి, అల్లాబకాష్, వెంకటలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.

## కారణం లేకుండా అబార్షన్‌లు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

**ప్రొద్దుటూరు క్రైం :** ఎలాంటి కారణం లేకుండా అబార్షన్‌లు చేస్తే ఆయా ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన అబార్షన్‌లపై ప్రొద్దుటూరు పీపీ యూనిట్ కేంద్రంలో బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, గైనకాలజిస్టు డాక్టర్ యశశ్విని మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా అబార్షన్‌లు చేయించుకుంటున్నట్లు చెప్పారు. మొదటి, రెండవ కాన్పులో ఆడపిల్లలకు జన్మనిచ్చిన వారు మళ్లీ ఆడపిల్ల పుడుతుందేమోననే కారణంతో అబార్షన్‌లు చేయించుకుంటున్నారని తెలిపారు. ఆడిట్ నిర్వహించి ఎక్కడ అబార్షన్‌లు చేయించుకుంటున్నారో గుర్తించి సంబంధిత ప్రైవేట్ హాస్పిటల్స్‌ను సీజ్ చేస్తామన్నారు. ఒక సారి అబార్షన్ చేయించుకుంటే మళ్లీ గర్భం దాల్చే అవకాశాలు సన్నగిల్లుతాయని చెప్పారు. ఆడపిల్లైనా, మగపిల్లాడైనా సమానం అనే భావన తల్లిదండ్రుల్లో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హనీఫ్‌బాబా, నజీర్, జ్యోత్స్న, అనూష, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మానసిక కుంగుబాటును జయించాలి



మాట్లాడుతున్న జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్

**ప్రొద్దుటూరు క్రైం :** మానసిక కుంగుబాటు ఆత్మహత్యలకు కారణం కారాదని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్ తెలిపారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా ఆస్పత్రి నుంచి జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ బృందం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ మానసికంగా బాధపడుతున్న వారు జిల్లా ఆస్పత్రిలోని మానసిక వైద్యశాలను సంప్రదించాలని సూచించారు. మానసిక వైద్యురాలు కవితాప్రసన్న మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వస్తే 100 శాతం ఆత్మహత్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక ఆరోగ్య సేవల టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416 గురించి వివరించారు. ఆరోగ్య సహాయం కోసం ఈ నెంబర్‌ను సంప్రదించిన వారికి కౌన్సిలింగ్ సేవలను అందిస్తామని పేర్కొన్నారు. ఆత్మహత్యలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రంగస్వామి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర, శ్రీనివాస ఫార్మసీ కళాశాలల విద్యార్థులు, ఎస్ఆర్ఐటీ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐలు, కళాశాల చైర్మన్

**ప్రొద్దుటూరు కల్చరల్ :** విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకల్యాణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ప్రవేశ్ 2కే25లో భాగంగా ఫ్రెషర్స్ డే, ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణం, సీకే దిన్నె సీఐ బాలమద్దిలేటిలు మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టారని, సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోటివేటర్ చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు నాలెడ్జ్, నెట్‌వర్క్, క్రియేటివిటీని అలవర్చుకుని ముందుకు సాగాలన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

**బద్వేలు అర్బన్ :** గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు చిరంజీవి, సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుండి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు విముక్తి కల్పించాలని కోరారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించడంతో పాటు బలవంతపు విధులు చేయించడం ఆపాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు ఆరు సంవత్సరాలు ఒకే కేడర్‌లో పనిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. అన్ని విభాగాల వారికి ప్రమోషన్ ఛానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలని కోరారు. వీలైనంత త్వరగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ముద్దుక్రిష్ణ, గౌతమ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌బాషా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుగంగ నీటితో చెరువులను నింపాలి



తెలుగుగంగ ఎడమ కాలువలో నీరు పారుతున్న దృశ్యం

**కలసపాడు :** మండలంలోని దూలంవారిపల్లె గత ప్రభుత్వంలో లిఫ్టిఇరిగేషన్ ద్వారా తడుకుచెరువు, తిక్కమ్మచెరువు, నేలకుంటచెరువు, దూలంవారిపల్లె చెరువులను నింపేవారని ఆయకట్టు రైతులు తెలిపారు. గత ప్రభుత్వంలో ఆయకట్టు రైతులు ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలను చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు విడుదల చేయాలని కోరగా అప్పట్లో యుద్ధప్రాతిపదికన 75 రోజుల్లో రూ.18 కోట్లతో చెరువులకు నీరు నింపి ఆయకట్టు రైతులను ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం 15 నెలలు కావస్తున్నా తెలుగుగంగ ఎడమ కాలువకు 25 రోజులు నీరు విడుదల చేసినా చెరువులకు లిఫ్టిఇరిగేషన్ ద్వారా నీటిని ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే లిఫ్టిఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు ఇవ్వాలని కోరారు. చెరువులను నింపకుంటే మూకుమ్మడిగా పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు.

## జేవీవీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**బద్వేలు అర్బన్ :** ఈ నెల 13, 14వ తేదీల్లో విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న జనవిజ్ఞానవేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.డి.దేవదత్తం, జిల్లా గౌరవ సలహాదారులు చింతంరెడ్డిరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ ప్రమీల ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మకాలు, భయాలు, అవిశ్వాసాలను తొలగించి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో జనవిజ్ఞానవేదిక కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. జనవిజ్ఞానవేదిక కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక బద్వేలు, గోపవరం మండలాల ప్రధాన కార్యదర్శులు పవన్‌కుమార్, కరుణాకర్, కమిటీ సభ్యులు లాజరయ్య, శివకుమార్, థామస్, బ్రహ్మయ్య, మునెయ్య, బాలయ్య, సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

### తలనీలాల పాట రూ.19.64 లక్షలు

**పోరుమామిళ్ల :** మండలంలోని గుర్రప్పగారిపల్లె గ్రామ సమీపంలో నగిలేరు ఒడ్డున వెలసిన శ్రీమద్ది మానుగుర్రప్పస్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్.రామలింగారెడ్డి, రాజంపేట తనిఖీ అధికారి ఎస్.జనార్దన్‌ల ఆధ్వర్యంలో తలనీలాల వేలంపాట నిర్వహించారు. పాటలో తలనీలాలను జె.సురేష్ గురజాల రూ.19.64 లక్షలకు పాటపాడి దక్కించుకున్నారు. అలాగే టెంకాయల వేలం పాటను బి.పుల్లయ్య రూ.4.10 లక్షలు, అంగళ్ళు పెట్టుకునే హక్కును బి.పుల్లయ్య రూ.4.96 లక్షలు, కూల్‌డ్రింక్ షాపును జి.నాగేంద్ర రూ.1.84 లక్షలు, కొబ్బరిచిప్పలు సేకరించుకునే హక్కును బి.పుల్లయ్య రూ.43,500లు, పూలదండలు, నిమ్మకాయలు విక్రయించుకునేందుకు బి.పుల్లయ్య రూ.8500లు పాడి దక్కించుకున్నారు.

### మెరుగైన వైద్యం అందించాలి

**పోరుమామిళ్ల :** పట్టణంలోని రాఘవి డెంటల్ క్లినిక్, శ్రీదేవి స్మైల్ డెంటల్ క్లినిక్‌లను బుధవారం జిల్లా డిప్యూటీ వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వి.మల్లేష్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, వైద్యుల అర్హత పత్రాలు, రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులను మర్యాదపూర్వకంగా స్వాగతించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అనంతరం టేకూరుపేటలో ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించి యూవీఐఎన్ యాప్ అప్‌లోడ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాదువెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీవిద్య, రఘురామ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించండి

**మైదుకూరు :** ప్రభుత్వ ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించాలని బద్వేలు ఆర్డీఓకు విజ్ఞప్తి చేసినట్టు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మైదుకూరు తాలూకా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు కె.వీరాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, సంఘం కార్యకలాపాల కోసం కార్యాలయం అవసరమని బుధవారం ఆర్డీఓ చంద్రమోహన్‌ను కలిసి వివరించినట్టు వారు పేర్కొన్నారు. అందువల్ల మైదుకూరులో ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు.

### శంఖవరంలో పశువైద్య శిబిరం



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శారదమ్మ

**కలసపాడు :** మండలంలోని శంఖవరంలో బుధవారం ఏపీ పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచితం పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ, కడప డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి హాజరయ్యారు. శిబిరంలో 48 పశువులకు గర్భకోశ పరీక్షలు, 19 పశువులకు చూలు పరీక్షలు, అలాగే ఎదకు రాని పశువులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 72 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. శిబిరంలో ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు చంద్రశేఖర్, జిల్లా పశుగణాభివృద్ధి వెటర్నరీ డాక్టర్ శివరామిరెడ్డి, పశువైద్యాధికారులు డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, శివశ్రీనివాసులరెడ్డి, భరద్వాజకృష్ణ, శంఖవరం సర్పంచ్ డి.రాధాదేవి పాల్గొన్నారు.

### హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష వీడాలి

**ప్రొద్దుటూరు క్రైం :** హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను విడనాడాలని ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి తెలిపారు. హెచ్ఐవీపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 1097 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి హెచ్ఐవీపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు పవన్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు, చైతన్య సొసైటీ సిబ్బంది పుల్లయ్య, ఓబులమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

### ప్రజలు సోదరభావంతో మెలగాలి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** ప్రజలు సోదరభావంతో మెలగాలని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహామండలి సభ్యుడు ఇందాదుల్లా హుస్సేని పేర్కొన్నారు. స్థానిక భారత్ ఫంక్షన్ హాల్‌లో జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నేటి సమాజానికి అంతిమ దైవ ప్రవక్త మహ్మద్ సందేశం అనే అంశంపై ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భూమిపై శాంతి, సామరస్యం నెలకొల్పడానికి, ప్రజల్లో సమానత్వం సాధించడానికి ప్రవక్త కృషి చేశారని తెలిపారు. నేటికీ ప్రవక్త బోధనలు అనుసరణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ కదిరి పట్టణ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖాదీర్, ఎన్ఎస్ మొహిద్దీన్, గౌస్ మొహిద్దీన్ నిజామి, కడప జిల్లా అధ్యక్షుడు రహమతుల్లా, పట్టణాధ్యక్షుడు షఫీవుల్లా, సభ్యులు హుస్సేన్ అహ్మద్, డీకే చదువులబాబు, బ్రహ్మకుమారి రాజయోగిని శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్

**మైదుకూరు :** ఎర్ర చందనం వృక్ష సంపద పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని వనిపెంటలో పోలీస్ కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో 'మేలుకొలుపు'నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ ఎర్ర చందనం అక్రమ రవాణాకు పాల్పడితే జైలు జీవితం గడపక తప్పదన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాజాగృతి బృందం ఇంచార్జ్ జి.నరసరామ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ

**కలసపాడు :** మండల కేంద్రమైన కలసపాడులో బుధవారం జిల్లా డిప్యూటీ వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేష్ ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, బయో మెడికల్ వ్యర్థాలను, సిబ్బంది అర్హతలు, పరికరాలు, ల్యాబ్, ఫార్మసీని తనిఖీ చేసి అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శైలజ, సాయితేజ, ప్రైవేటు క్లినిక్ వైద్యుడు డాక్టర్ జయరామిరెడ్డి, పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి నాయీబ్రాహ్మణుల వినతి



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణులు

**అట్లూరు :** తమ సమస్యలను పరిష్కరించాలని పోరుమామిళ్ల మండలానికి చెందిన నాయీబ్రాహ్మణులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుండి క్షవరం వృత్తిని నమ్ముకుని దాదాపు 55 షాపులను నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. ఇటీవల రంగ సముద్రం పంచాయతీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పక్కన అగ్రకులస్తులు సెలూన్ షాప్ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది మా జీవనోపాధిని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. అనుమతి ఇవ్వకుండా మా వృత్తి రక్షణకు సహకరించాలని కోరారు. మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారికి తెలిపారు.

## ఔదార్యం చాటుకున్న గౌడ్ సంఘం

**పొలంలో పని చేస్తూ గాయపడిన బ్రహ్మయ్యకు రూ.1.4లక్షలు అందజేత**



బాధితునికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న గౌడ్ సంఘం నాయకులు

**మైదుకూరు :** ఇటీవల పొలంలో పనిచేస్తూ తీవ్రంగా గాయపడిన వలదాసు బ్రహ్మయ్య గౌడ్ అనే వ్యక్తికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గౌడ్ సంఘం, ఉమ్మడి కడప జిల్లా ఈడిగ, గౌడ్ సంఘం నాయకులు బుధవారం రూ.1.40లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మైదుకూరు సమీపంలో చింతకుంట బయనపల్లెకు చెందిన రైతుకూలి బ్రహ్మయ్య గౌడ్ కొద్ది రోజుల కిందట పొలం గట్టు చెక్కే పని చేస్తూ తీవ్రంగా గాయపడినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. మెరుగైన చికిత్స చేయించేందుకు ఆర్థిక స్తోమత లేదని బాధితుని కుటుంబ సభ్యులు సంఘం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. ఉమ్మడి కడప, కర్నూలు జిల్లా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గౌడ్ సంఘం నాయకుల సహకారంతో రూ.1.4లక్షలను అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మయ్య గౌడ్‌కు అందజేసినట్టు వివరించారు. ఇందుకు సహకరించిన కేతకుమార్, సిద్ధార్థ గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం గౌడ్, నరసింహా గౌడ్, శ్రీధర్ కుమార్ గౌడ్, గంగాధర్ గౌడ్, రామ్మూర్తి నాయుడు గౌడ్, మునిరత్నం గౌడ్, వెంకటసుబ్బయ్య గౌడ్, శివరామకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు రజక ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**బద్వేలు అర్బన్ :** పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు కొనసాగించిన యోధురాలు రజక ఐలమ్మ అని చేతివృత్తిదారుల సంఘం పట్టణ కార్యదర్శి జి.నాగార్జున, సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. రజక ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన చేనేత, కుమ్మరి, చాకలి లాంటి వృత్తిదారులను హీనంగా చూస్తున్న దొరలను ముప్పు తిప్పలు పెట్టిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. అలాగే పేదలకు భూములు దక్కేవరకు జమిందారులను, పట్వారీలను జనచైతన్యంతో తరిమి కొట్టిన ధీరవనిత ఐలమ్మ అన్నారు. ఇటువంటి వీరవనితను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.